# సరైన అవగాహనతో సికిల్ సెల్ నిర్మూలన

- వ్యాధికి అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట కార్యాచరణ
- 19 నుంచి జూలై 3 వరకు అవగాహన కార్యక్రమాలు
- గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



వైద్యాధికారులతో కలిసి పోస్టర్లు, కరపత్రాలు, మ్యాన్యువల్స్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

**కృష్ణలంక, జూన్ 19 :** సరైన అవగాహనతో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలించవచ్చని జూన్ 19 నుంచి జూలై 3 వరకు గిరిజన సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖల సమన్వయంతో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. బుధవారం ప్రపంచ సికిల్ సెల్ దినం సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో గిరిజన సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు, ఆర్డీవో వి.శ్రీనివాసరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జె.సునీత, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, వైద్యాధికారులతో కలిసి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ వ్యాధి సమగ్ర సమాచారానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు, మ్యాన్యువల్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై 15రోజులపాటు పాఠశాలలతో పాటు ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 2047 నాటికి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌లో భాగంగా వివిధ వర్గాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. సికిల్ సెల్ వ్యాధి వారసత్వంగా తల్లిదండ్రుల నుంచి అనువంశికంగా సంక్రమిస్తుందన్నారు. రక్తహీనత, కళ్లు పసుపురంగులో మారడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్లనొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచుగా అంటు వ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు, అవయవ వైఫల్యం పెరుగుదల సమస్యలు కలిగి ఉంటాయన్నారు. శరీరంలో తగినంత నీటి శాతం పాటించడం, సమతుల ఆహారం, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ముందు తరాలకు వ్యాధి వ్యాపించకుండా నిరోధించాలంటే సరైన అవగాహన ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌లోని ముఖ్యాంశాలు, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పరీక్ష, సికిల్ సెల్ ఎనీమియా చికిత్స తదితర అంశాలపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో నిర్వహించే అవగాహనా కార్యక్రమాల కార్యాచరణ ప్రణాళిక, క్షేత్రస్థాయి అధికారుల సమన్వయం తదితర అంశాలను జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జె.సునీత వివరించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బీసీకే నాయక్, డీఐవో డాక్టర్ అమృత, డీఎంవో డాక్టర్ మోతీబాబు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ జె.సుమన్, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ అధికారి డాక్టర్ మాధవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇందుమతి, వైద్యాధికారులు, ఎఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## బందరులో అవగాహన ర్యాలీ

**మచిలీపట్నం టౌన్ :** ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి బుధవారం డిఎంహెచ్‌వో కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా గీతాబాయి మాట్లాడుతూ, జిల్లాలో 0 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల వారికి అన్ని పీహెచ్‌సీలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో అవగాహనర్యాలీలు, సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎ.సీతాకుమారి, కార్యక్రమ నిర్వహణ అధికారి అరుణ్‌కుమార్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, కార్యాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీలో పాల్గొన్న గీతాబాయి